కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించాలి



అరెస్టు చేస్తున్న పోలీసులు

నాంపల్లి: విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మధ్యాహ్నం మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయం ముట్టడికి యత్నించారు. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేసి ముషీరాబాద్, బేగంబజార్ పోలీసుస్టేషన్లకు తరలించారు. అలాగే కార్యాలయం బయటి గేట్లను మూసేసి నాంపల్లి ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 12 విశ్వవిద్యాలయాల్లో 1,170 మంది పని చేస్తున్నారని వారిని క్రమబద్ధీకరించాకే శాశ్వత నియామకాలు చేపట్టాలని, అప్పటి వరకు దరఖాస్తుల స్వీకరణను ఆపివేయాలని కోరారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ సూచించారు. టోలిచౌకి మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకులు, ఏరియా కమిటీ ప్రతినిధులతో బుధవారం సమావేశమయ్యారు. కార్యక్రమంలో నాయకులు హబీబ్, రఫత్‌హుస్సేన్, ఆలీముద్దీన్, జుబేర్ తదితరులు ఉన్నారు.

నానల్‌నగర్ డివిజన్ అభివృద్ధికి కృషి



మజ్లిస్ నాయకులతో కార్పొరేటర్ నసీరుద్దీన్

గోల్కొండ: నానల్‌నగర్ డివిజన్ అభివృద్ధికి కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ కృషి చేస్తున్నారని డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ అన్నారు. డివిజన్‌లోని వివిధ బస్తీల నాయకులతో కలిసి బుధవారం మాట్లాడారు. కాలనీ సంక్షేమ సంఘాల విన్నపం మేరకు కాలనీల్లో అధునాతన వీధి దీపాలు, మినీ హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయించారన్నారు. కార్యక్రమంలో నాయకులు మిర్జా ఎక్బాల్ అహ్మద్, జుబేర్ బిన్ అవద్, ఆలీ, సయ్యద్ రఫత్ తదితరులు ఉన్నారు.

రేషన్ షాపు తనిఖీ



బియ్యం పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి

గౌలిపురా: బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎ.శివచంద్రగిరితో కలిసి గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి హనుమాన్‌నగర్‌లోని రేషన్ షాపును బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి లబ్ధిదారుడికి అందిస్తున్న 6 కిలోల బియ్యంలో 5 కిలోల బియ్యం కేంద్ర ప్రభుత్వం, ఒక కిలో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందన్నారు. పీఎం నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ ప్రతి రేషన్ షాపులో ఆయన చిత్రపటాన్ని పెట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పి.రాజేశ్, యాదగిరి, కొడి సురేందర్, నర్సింగ్, అనిత, యువ మోర్చా నాయకులు సాకేత్, గోవర్ధన్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



అందజేస్తున్న ఎస్.డి.ఎం.సుభానీ

నాంపల్లి: హైదరాబాద్ సింగరేణి భవన్‌లో కొన్నేళ్లుగా కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న దాసు (51) ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా తోటి కాంట్రాక్టు కార్మికులు, సింగరేణి అధికారులు, ఉద్యోగులు కలిసి రూ.90 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని హైదరాబాద్ సింగరేణి భవన్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్) ఎస్.డి.సుభానీ రెడ్‌హిల్స్‌లోని సింగరేణి భవన్‌లో ఉద్యోగుల సమక్షంలో దాసు కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. తోటి ఉద్యోగులు అందించిన సాయంపై దాసు కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉన్నా..లేనట్టే..!

- అధ్వానంగా బస్టాప్‌ల నిర్వహణ
- రోడ్లపైనే బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు
- మరోవైపు బస్టాప్‌ల్లో ఆగని బస్సులు
- పట్టించుకోని అధికారులు

గోల్కొండ: ఆర్టీసీ వారు లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన బస్‌షెల్టర్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని ప్రాంతాల్లోని బస్‌షెల్టర్ల పక్కనే ఉన్న టాయిలెట్స్ నుంచి దుర్వాసన వెదజల్లుతుండగా, మరికొన్ని చోట్ల బస్టాప్‌ల్లో కొందరు దర్జాగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీంతో ప్రయాణికులు బస్సుల కోసం రోడ్లపైనే వేచి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. రేతిభౌలి, నానల్‌నగర్ జంక్షన్, షాగౌస్ హోటల్ తదితర ప్రాంతాల్లోని బస్టాప్‌లు కబ్జాదారుల చెరలో ఉన్నాయి. ఇదిలాఉంటే కొందరు డ్రైవర్లు బస్టాప్‌ల వద్ద కాకుండా ఇతర చోట్ల బస్సులు ఆపుతున్నారు. దీంతో పరుగులు తీస్తూ బస్సులు ఎక్కాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. మెహిదీపట్నం సరోజినీదేవి ఆసుపత్రి వద్దనున్న బస్‌షెల్టర్ సైతం ఉపయోగంలో లేకుండా పోతోంది. పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే ఇక్కడి నుంచే ప్రారంభం అవుతుంది. ఈ కారణంగా ఈ రోడ్డు గుండా నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ ఫుట్‌పాత్‌లపైనే బస్సుల కోసం వేచి చూస్తున్నారు.



రేతిభౌలి వద్ద బస్సుల కోసం రోడ్డుపైనే నిల్చున్న ప్రయాణికులు

బస్టాప్‌ల నిర్వహణ గాలికి..

మెహిదీపట్నం ప్రధాన బస్టాప్‌కు ప్రతిరోజూ వందల సంఖ్యలో బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. విద్యార్థులు, ఉద్యోగులతో పాటు వివిధ ప్రాంతాలకు వెళ్లివచ్చే వారు ఇక్కడికే వస్తుంటారు. అయితే వారికి సరిపడా బస్‌షెల్టర్లు లేకపోవడం, మరోవైపు ఇక్కడి పబ్లిక్ టాయిలెట్స్ నుంచి దుర్వాసన వస్తుండడంతో ప్రయాణికులు గత్యంతరం లేక రోడ్డుపైనే నిలబడుతున్నారు. మరోవైపు ఇష్టారాజ్యంగా పెడుతున్న తోపుడు బండ్లతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్టాప్‌లు ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

విద్యార్థులు, మహిళలకు ఇబ్బందులు..



బస్‌షెల్టర్ల వద్ద కాకుండా డ్రైవర్లు ఇష్టమొచ్చిన చోట్ల బస్సులు ఆపుతున్నారు. దీంతో ఉదయం విద్యాసంస్థలకు వెళ్లే స్టూడెంట్స్, ఉద్యోగాలకు వెళ్లే మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే బస్టాప్‌ల వద్ద పెడుతున్న తోపుడు బండ్లను తొలగించాలి. బస్‌షెల్టర్ల వద్దే బస్సులు ఆపేలా అధికారులు డ్రైవర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి.

–ఇమ్రోజ్, టోలిచౌకీ



నానల్‌నగర్ వద్ద..

ముగిసిన చిల్డ్రన్స్ థియేటర్స్ ఫెస్టివల్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నిశుంబిత స్కూల్ ఆఫ్ డ్రామా ఆధ్వర్యంలో మూడు రోజులుగా రవీంద్రభారతిలో జరుగుతున్న మొదటి అంతర్జాతీయ చిల్డ్రన్స్ థియేటర్ ఫెస్టివల్ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి చిన్నారులకు నాటకలపై మక్కువ కలిగేలా ప్రయత్నించడం అభినందనీయమన్నారు. ఏటా చిల్డ్రన్స్ థియేటర్ ఫెస్టివల్ నిర్వహించాలని కోరారు. అనంతరం ప్రముఖ రంగస్థల కళాకారులు డాక్టర్ తపస్‌దాస్‌కు రంగ పురస్కార్‌ను ప్రదానం చేశారు. అంతకుముందు కేరళ, కోల్‌కత్తా రాష్ట్రాలకు చెందిన చిన్నారుల నాటక ప్రదర్శనలు ఆకట్టుకోగా వాసవి, వేదిక్ స్కూల్ విద్యార్థులు చేసిన నాటకాలు ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో సినీ నటుడు అశితోష్, సంస్థ డైరెక్టర్ డాక్టర్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడు మల్లేశ్ యాదవ్

విజయనగర్‌కాలనీ: ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నిందితుడిని అరెస్టు చేసిన ఘటన టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఎ.రాములు, ఎస్‌ఐ.అమ్జద్ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. కార్వాన్ ఆర్య సమాజ్‌లో నివసించే మల్లేశ్ యాదవ్ (33) పాల వ్యాపారం చేస్తుంటాడు. అయితే అదనపు ఆదాయం కోసం ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, టప్పాచబుత్ర పోలీసులు దాడి చేసి నిందితుడి నుంచి రూ.21 వేలు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సీతారాముల ఉత్సవమూర్తుల ఊరేగింపు

డబీర్‌పురా: శ్రీరామనవమి సందర్భంగా కోమటివాడిలోని రామాలయం సీతారాముల ఉత్సవ మూర్తులను బుధవారం సాయంత్రం బ్యాండ్ మేళాలు... డప్పు చప్పుళ్ల మధ్య ఘనంగా ఊరేగించారు. రామాలయం నుంచి బయలుదేరిన ఊరేగింపు డబీర్‌పురా, పోచమ్మ ఆలయం, నూర్‌ఖాన్‌బజార్, కట్టెలగూడ, ఆర్య సమాజ్ లేన్ మీదుగా తిరిగి రామాలయానికి చేరుకున్నది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆలె నరేంద్రకు ఘన నివాళి



నరేంద్ర చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

గౌలిపురా: గౌలిపురా మార్కెట్, శ్రీరాంనగర్ కాలనీ, గౌలిపురా ఆలె నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కేంద్ర మాజీ మంత్రి టైగర్ ఆలె నరేంద్ర వర్ధంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే గౌలిపురా డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సుమన్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, బీజేపీ నాయకులు మోకాళ్ల వెంకటేశ్, జి.రఘుకాంత్, జమాల్‌పూర్ అశోక్, ధీరజ్‌లాల్, రాజ్ కుమార్, ఎ.శివచంద్రగిరి, యాదయ్య, వికాస్, దాస్, నర్సింగ్, రవి పాల్గొన్నారు.

ఉదయ్ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో..

చాంద్రాయణగుట్ట: బీజేపీ నాయకుడు ఉదయ్ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఆలె నరేంద్ర చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొడి మహేందర్, అసెంబ్లీ కన్వీనర్లు ప్రశాంత కుమార్, ఎడ్ల పండరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై కఠిన చర్యలు

రాజేంద్రనగర్ ఎంఈవో శంకర్‌రాథోడ్



అత్తాపూర్: రాజేంద్రనగర్ మండలంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలను నిర్వహిస్తే ఆయా విద్యా సంస్థల యాజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల విద్యాశాఖాధికారి శంకర్‌రాథోడ్ హెచ్చరించారు. కొన్ని పాఠశాలలు తమ పాఠశాల పేరు చివర్లో ఏదో ఒక తోకను తగిలించుకున్నారని వాటిని వెంటనే తొలగించాలన్నారు. కొందరు సీబీఎస్ఈ పేరుతోనూ చిన్నారుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. ఆ విధంగా ఏర్పాటు చేసిన బోర్డులను వెంటనే తొలగించాలన్నారు. అనుమతులు లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పవద్దని తల్లిదండ్రులకు ఈ సందర్భంగా ఎంఈవో సూచించారు. సీబీఎస్ఈ అనుమతులు ఉన్న పాఠశాలలు కేవలం 11 మాత్రమే ఉన్నాయన్నారు. అవి భారతీయ విద్యా భవన్, మహేష్ విద్యాభవన్, గ్రీన్‌విచ్ అకాడమీ, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, సాలిటాట్ స్కూల్, బిడ్జి హై స్కూల్, ఎడిఫై స్కూల్, గేట్‌వే, లోటస్ నేషనల్ స్కూల్, ఓలీవ్ మౌంట్ స్కూల్, కేంద్రీయ విద్యాలయానికి మాత్రమే సీబీఎస్ఈ అనుమతులు ఉన్నాయన్నారు. పాఠశాలలు మిగిలిన పాఠశాలలు అన్నీ కూడా స్టేట్ సిలబస్ సంబంధించినవే అన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాలను గమనించాలన్నారు. అదే విధంగా ఏ పాఠశాలలో కూడా స్టేషనరీ ఐటమ్స్ విక్రయించేందుకు వీలు లేదని ఆయన స్పష్టం చేశారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

విజయనగర్‌కాలనీ: అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసిన ఘటన టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఎ.రాములు, అడ్మిన్ ఎస్ఐ అమ్జద్ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. జిర్రా నట్రాజ్‌నగర్‌లో నివసించే సయ్యద్ ఇబ్రహీం (30), చోటు కుమార్ ట్రాన్స్‌పోర్ట్ ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తుండగా జిర్రా సలీం హోటల్ వద్ద పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. 13.60 క్వింటాళ్ల బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రవీంద్రభారతీ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే



గోల్కొండ: టోలిచౌకీ సూర్యనగర్ కాలనీలోని రవీంద్రభారతీ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉషాబోయిన్‌పల్లి హాజరై యుకేజీ పూర్తి చేసుకున్న చిన్నారులకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో రవీంద్రభారతీ పాఠశాలల మెహిదీపట్నం జోన్ డీన్ ప్రియామనీష్, డివిజనల్ ఇన్‌చార్జి మధు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కనీవిని ఎరగని రీతిలో బీఆర్ఎస్ ఆవిర్భావ సభ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

గోల్కొండ: కనీవిని ఎరగని రీతిలో వరంగల్‌లో బీఆర్ఎస్ ఆవిర్భావ సభను నిర్వహిస్తామని ఆ పార్టీ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ అన్నారు. మొగల్‌కా నాలాలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ నాయకుడు శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. దేశం మొత్తం వ్యతిరేకిస్తున్నా హెచ్‌సీయూ భూములు విక్రయించేందుకు సీఎం సిద్ధపడడం సిగ్గుచేటు అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత తీవ్ర స్థాయిలో ఉందని ఆ పార్టీ నాయకులే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొడుతారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ మహాసభ దేశం నివ్వెరపోయేలా జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు టి.జీవన్‌సింగ్, శ్రీధర్‌సాగర్, శ్రీనివాస్ గుప్తా, ముత్యాల భాస్కర్ తదితరులు ఉన్నారు.

సభను జయప్రదం చేయండి



ఎమ్మెల్సీ శ్రవణ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు పప్పు మాత్రే ఆనంద్‌సింగ్

అబిడ్స్: వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ వజ్రోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజి శ్రవణ్ పిలుపునిచ్చారు. గోషామహాల్ నియోజకవర్గ సన్నాహక సమావేశాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలోనే గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు పప్పు మాత్రే ఆనంద్‌సింగ్, శ్రీనివాస్ యాదవ్, కుమార్, దినేశ్, కోళ్ల ప్రదీప్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

‘ఎర్లీబర్డ్’ను సద్వినియోగం చేసుకోండి

రాజేంద్రనగర్ సర్కిల్ డీసీ డాక్టర్ రవికుమార్



ఆస్తిపన్ను చెల్లిస్తున్న ప్రజలు

రాజేంద్రనగర్: జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆస్తిపన్ను చెల్లింపుదారులు ఎర్లీబర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్కిల్ ఉప కమిషనర్ డాక్టర్ రవికుమార్ కోరారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో ఆస్తిపన్ను స్వీకరించేందుకు ఏర్పాటు చేసిన కౌంటర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ... ప్రభుత్వం ఈ నెల 30వ తేదీ వరకు ఆస్తిపన్ను చెల్లించే వారికి 5 శాతం రాయితీ ఇస్తుందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్నుతో ఈ 5 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఈ పథకం ద్వారా ఆస్తిపన్ను చెల్లింపుదారులు ఆస్తిపన్ను చెల్లించి రాయితీ పొందాలన్నారు.

రూ. 4 కోట్ల పన్ను వసూలు...

ఎర్లీ బర్డ్ ద్వారా బుధవారం సాయంత్రానికి రూ. 4 కోట్లమేర ఆస్తిపన్నును వసూలైందని ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. ఉన్నతాధికారులు ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 25 కోట్లు వసూలు చేయాలని టార్గెట్ పెట్టారన్నారు. అందుకు అనుగుణంగా రోజువారీ టార్గెట్‌ను పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీ లోగా టార్గెట్‌ను పూర్తి చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇందుకు ప్రజలు సైతం సహకరించాలని కోరారు.

ఆన్‌లైన్‌లోనూ చెల్లించొచ్చు...

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆస్తిపన్ను చెల్లింపుదారులు తమ ఆస్తి పన్నును ఆన్‌లైన్‌ల ద్వారా చెల్లించవచ్చని ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా లేదా తమ ఇంటి వద్దకు వచ్చే బిల్లు కలెక్టర్లు తదితరులకు చెల్లించాలన్నారు. ప్రస్తుతం సర్కిల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఆయా కౌంటర్లలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఆస్తిపన్ను చెల్లించవచ్చన్నారు.

కేంద్రం అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న అడికే జనార్దన్

మైలార్‌దేవ్‌పల్లి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం చేపట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నేత అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. కాటేదాన్‌లోని బీజేపీ కార్యాలయంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు అడికే జనార్దన్ అధ్యక్షతన డివిజన్ క్రియాశీలక సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీరాములు యాదవ్ మాట్లాడారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ సాధించిన విజయాలు ట్రిపుల్ తలాక్, 370 ఆర్టికల్, పార్లమెంట్‌లో ఆమోదం పొందిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు తదితర వాటిపై చర్చించారు. అభివృద్ధి సంక్షేమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ సీనియర్ నేతలు జోగి రవి, బుచ్చిరెడ్డి, జగన్, సంతోష్‌గౌడ్, సి.హెచ్. వెంకటరమణగుప్తా, నర్సిరెడ్డి, వల్లూరి శ్రీనివాస్, వినయ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాజ్‌కుమార్, బొల్ల రామకృష్ణ, శ్రావణ్‌కుమార్, మన్మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గూడూరి అంజి, ఉడుత లక్ష్మి, అరుణ్, సచిన్, శంకర్‌రెడ్డి, బండి నరోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ విజయ యాత్రను

శాంతియుతంగా నిర్వహించాలి

- 17 వేల మంది బలగాలతో పటిష్ట బందోబస్తు
- హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్
- యాత్ర ఏర్పాట్లపై అధికారులతో సమావేశం
- 12.2 కిలోమీటర్ల రూట్ పరిశీలన



మాట్లాడుతున్న హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

సుల్తాన్‌బజార్: వీర హనుమాన్ విజయ యాత్రను శాంతియుతంగా నిర్వహించాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ కోరారు. ఈనెల 12న హనుమాన్ జయంతి సందర్భంగా జరిగే యాత్ర ఏర్పాట్లపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు యాత్ర నిర్వాహకులతో కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజ్ ఆడిటోరియంలో బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ నగర పోలీస్ అధికారులతో పాటు సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ అధికారులు తెలంగాణ రాష్ట్ర భజరంగ్‌దళ్ వీహెచ్‌పీ నాయకులు, జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ, ఫైర్ సర్వీసెస్, ఎలక్ట్రిసిటీ, ఈఎంఆర్ఐ, టీజీఆర్టీసీ, జలమండలి, రవాణ, వైద్యారోగ్యశాఖలకు చెందిన సీనియర్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ఊరేగింపు సమయంలో ట్రాఫిక్‌జామ్ కాకుండా ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలన్నారు. రైల్వే బ్రిడ్జి కంటే ఎక్కువ ఎత్తు విగ్రహాలు ఏర్పాటు చేస్తే వేరే మార్గం ద్వారా పంపిస్తామన్నారు. సౌండ్ మిక్సర్ లేకుండా పెద్ద సౌండ్ బాక్సులను వినియోగించుకోవాలని సూచించారు. వాతావరణ శాఖ సమాచారం మేరకు శనివారం వర్ష పడే అవకాశం ఉంటుందని జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఊరేగింపులో ఎంతమంది, ఎన్ని వాహనాలు ఉపయోగిస్తున్నారో సంబంధిత పోలీసులకు తెలియజేయాలని సూచించారు. నిర్వాహకులు రోప్ పార్టీ సభ్యులకు (వలంటీర్లకు) సరైన శిక్షణ ఇచ్చి వారిని వినియోగించుకోవాలన్నారు. పోలీసు శాఖ అనుమతి లేకుండా డ్రోన్ కెమెరాల వినియోగానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. హైదరాబాద్ సిటీ కమిషనరేట్ పరిధిలో సుమారు 150 వీర హనుమాన్ విజయ యాత్ర, సైబరాబాద్ రాచకొండ పరిధిలో నుండి 46 విజయాత్రలు తీస్తున్నారని, అవి ప్రధాన యాత్రలో కలిసి ముందుకు వెళ్తారన్నారు.

సోషల్ మీడియాలో పుకార్లు వ్యాప్తి చేయొద్దు

సోషల్ మీడియాలో పుకార్లు, రెచ్చగొట్టే పోస్టులు, ఫేక్ మెసేజ్‌లు వ్యాప్తి చేయవద్దని సీపీ సీవీ ఆనంద్ కోరారు. వాటిపై పోలీసు నిఘా ఉంటుందని రెచ్చగొట్టే వ్యాఖ్యలు, వీడియోలు అప్‌లోడ్ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

17 వేల మంది బలగాలతో బందోబస్తు..

విజయాత్ర జరిగే గౌలిగూడ రామ మందిర్ నుంచి సుల్తాన్‌బజార్, రామ్‌కోఠి, కాచిగూడ చౌరస్తా, నారాయణగూడ, ఆర్టీసీ క్రాస్‌రోడ్, కావడిగూడ, బైబిల్‌హౌస్ మీదుగా తాడ్బన్ హనుమాన్ ఆలయం వరకు 17 వేల మంది పోలీసులతో పాటు అదనంగా సాయుధ బలగాలతో భారీ బందోబస్తును నిర్వహిస్తున్నామని కమిషనర్ తెలిపారు. అంతేగాకుండా 12న ఉదయం 8 నుంచి హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ కార్యాలయం, ఐసీసీసీ భవనం, బంజారాహిల్స్‌లో జాయింట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఇందులో వివిధ శాఖల అధికారులు ఏ సమస్య వచ్చినా నిర్వాహకులకు తగిన సూచనలు, సలహాలు ఇస్తారని సూచించారు. అనంతరం సీవీ ఆనంద్ ఇతర శాఖల అధికారులు, నిర్వహకులతో కలిసి ప్రధాన విజయాత్ర ఊరేగింపు ప్రారంభమయ్యే గౌలిగూడ రామ మందిరం నుండి తాడ్బన్ హనుమాన్ టెంపుల్ వరకు దాదాపు 12.2 కిలోమీటర్ల మార్గాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్ మాన్, జాయింట్ సీపీ జోయల్ డేవిస్, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్, ఇతర శాఖల అధికారులు రాజశేఖర్, మనోహర్ బాబు, వెంకటి, నర్సింహామూర్తి, వీహెచ్‌పీ నాయకులు శివరాములు, శ్రీరాములు, భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ అఖిల్‌తో పాటు అన్ని జోన్ల డీసీపీలు, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.